సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం | 9 | ఫిబ్రవరి | 2023



త్వరలోనే 'పోడు' పట్టాలు

ఉమ్మడి జిల్లాలో పోడు సాగుదారులకు త్వరలో పట్టాలు పంపిణీ చేస్తామని పోడు భూముల ప్రత్యేకాధికారి యోగితా రాణా చెప్పారు. 10లో



.. నిర్మాణాల్లో ఇష్టారాజ్యం

కొత్తగూడెంలో బహుళ అంతస్తుల భవనాలు యథేచ్ఛగా నిర్మిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. 8లో



వాతావరణం

జిల్లాలో గురువారం ఎండ తీవ్రత బాగానే ఉంటుంది. రాత్రి వేళ కూడా చలి ప్రభావం ఎక్కువగా ఉండదు.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక బుధవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం నిర్వహించారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అనుమతి లేకుండా విదేశాలకు ప్రధానార్చకుడు?

భద్రాచలం: శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ప్రధాన అర్చకుడిగా పనిచేస్తున్న ఒకరు అనుమతి లేకుండా విదేశాలకు వెళ్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. దేవస్థాన పరిధిలో పనిచేసే వైదిక కమిటీ సభ్యులు, అర్చకులు విదేశాలకు వెళ్లాలంటే దేవాదాయ శాఖ కమిషనర్ అనుమతి తప్పనిసరి. కానీ ఈ ప్రధానార్చకుడు హైదరాబాద్ వెళ్తున్నట్లు అనుమతి తీసుకుని విదేశాల్లో జరుగుతున్న ఓ ప్రైవేట్ ధార్మిక కార్యక్రమంలో పాల్గొనేందుకు వేళుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలోనూ ఇలాంటి ఘటనలు చోటుచేసుకోగా వివాదాలు తలెత్తాయి. కాగా దీనిపై ఆలయ ఈఓ శివాజీని వివరణ కోరగా.. హైదరాబాద్ వెళ్లి వస్తానంటే ఈనెల 13వ తేదీ వరకు సదరు ప్రధాన అర్చకుడికి సెలవు మంజూరు చేసినట్లు తెలిపారు.

అధ్యాపకురాలికి పీహెచ్‌డీ



కృష్ణవేణిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కొత్తగూడెంఅర్బన్: పట్టణంలోని శ్రీరామచంద్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్ విభాగ అధ్యాపకురాలు నాగన బోయిన కృష్ణవేణికి శ్రీజగదీశ్ ప్రసాద్ ఝాబర్మల్ తిబ్రేవాల యూనివర్సిటీ (రాజస్థాన్) వారు పీహెచ్‌డీ ప్రదానం చేశారు. 'యూనిక్ ఐడెంటిఫికేషన్ బేస్డ్ అథెంటికేషన్ ఫర్ ఎలక్ట్రానిక్ ఓటింగ్ సిస్టమ్ యూజింగ్ బయోమెట్రిక్ టెక్నాలజీ' అనే అంశంపై పరిశోధన చేసి సమర్పించిన సిద్ధాంతానికి గాను ఆమెకు పీహెచ్‌డీ వచ్చింది. ఈ సందర్భంగా కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.పద్మావతి, విభాగాధిపతి శ్రీదేవి తదితరులు కృష్ణవేణిని అభినందించారు.

28 వరకు రేషన్ బియ్యం పంపిణీ


అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

సూపర్‌బజార్(కొత్తగూడెం): పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు చౌకదుకాణాల ద్వారా ఈనెల 28 వరకు ఉచితంగా రేషన్ బియ్యం పంపిణీ చేయనున్నట్లు అదనపు కలెక్టర్ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని 2,75,362 రేషన్‌కార్డుదారులకు ఒక్కొక్కరికి 5 కేజీల చొప్పున, 18,661 అంత్యోదయ కార్డుదారులకు 35 కేజీల చొప్పున, మూడు అన్నపూర్ణ కార్డుదారులకు 10 కేజీల చొప్పున పంపిణీ చేస్తామని వివరించారు. బుధవారం నుంచే బియ్యం పంపిణీ ప్రక్రియను ప్రారంభించామని, లబ్ధిదారులు నిర్ణీత సమయంలో బియ్యం తీసుకోవాలని సూచించారు.

నేటి నుంచి డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ, ఒకేషనల్, బీసీఏ కోర్సుల మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్షలు గురువారం ప్రారంభంకానున్నాయి. ఈ మేరకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 34 పరీక్షలు కేంద్రాలు ఏర్పాటుచేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి తెలిపారు. ప్రతీ కేంద్రంలో ఒక చీఫ్ సూపరింటెండెంట్, అబ్జర్వర్, ప్రతీ జిల్లాకు స్క్వాడ్ బృందాలు ఉంటాయని తెలిపారు. ఈనెల 9, 10, 13, 14,15, 16, 17, 20, 21, 22వ తేదీల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్షలు జరుగుతాయని ఆయన వివరించారు.

టార్గెట్ జూన్



చురుకుగా సాగుతున్న బ్యారేజీ పనులు



- వానాకాలం నాటికి సీతమ్మ సాగర్ బ్యారేజీ
- కాంక్రీట్ పనులు పూర్తి చేసేలా చర్యలు
- సమాంతరంగా ఫ్లడ్‌బ్యాంక్, గేట్ల నిర్మాణం
- హెడ్ రెగ్యులేటరీ పనులు షురూ

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు మహబూబాబాద్ జిల్లా సాగునీటి అవసరాలు తీర్చే లక్ష్యంతో నిర్మిస్తున్న సీతమ్మసాగర్ బ్యారేజీ పనులు జోరందుకున్నాయి. గోదావరిలో నీటి ప్రవాహం తగ్గిపోవడంతో నిర్మాణంలో వేగం పెరిగింది.

రెండు వైపుల నుంచీ..

సీతమ్మ బ్యారేజీ నిర్మాణ పనుల కోసం గోదావరి నదికి అశ్వాపురం వైపునే క్యాంపు ఆఫీసుతో పాటు కార్మికులు బస చేసేందుకు వీలుగా షెడ్ల నిర్మించారు. నిత్యం అక్కడి నుంచే వందలాది మంది కార్మికులను బస్సుల ద్వారా పని ప్రదేశానికి తరలిస్తున్నారు. కాగా వేసవి కాలం సమీపిస్తుండటంతో పనుల్లో వేగం పెంచాలని నిర్మాణ పనులు దక్కించుకున్న ఎల్‌అండ్‌టీ సంస్థ నిర్ణయించింది. అందులో భాగంగా దుమ్ముగూడెం వైపు కూడా కార్మికులకు వసతి, కాంక్రీట్ మిక్సర్ తదితర నిర్మాణాలు చేపట్టగా అవి కూడా తుది దశకు చేరుకున్నాయి. మరో వారం రోజుల్లో రెండు వైపుల నుంచీ మెటీరియల్ అందిస్తూ వేలాది మంది కార్మికుల శ్రమతో బ్యారేజీ నిర్మాణ పనులు వేగవతం చేయనున్నారు. జూన్‌లో వర్షాలు పడి గోదావరి నదికి వరదలు వచ్చే నాటికి బ్యారేజీ పనులు పూర్తి చేయాలని, కనీసం సగం గేట్ల వరకైనా పూర్తి చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు.

భారీ ఫ్లడ్ బ్యాంక్..

సుమారు 150 ఏళ్ల కిందట ఇంజనీర్ సర్ ఆర్థర్ కాటన్ నిర్మించిన ఆనకట్ట నీటి నిల్వ సామర్థ్యం కేవలం ఆరు టీఎంసీలు కాగా, ప్రస్తుతం నిర్మిస్తున్న సీతమ్మసాగర్ బ్యారేజీ నీటి నిల్వ సామర్థ్యం 37 టీఎంసీలు. కాళేశ్వరంతో పాటు సమ్మక్క బ్యారేజీతో పోల్చినా శ్రీరామ్‌సాగర్ తర్వాత గోదావరి నదిపై ఇదే అతి పెద్ద ఆనకట్ట కావడం విశేషం. దీంతో బ్యాక్ వాటర్ కారణంగా పంట పొలాలు నీట మునగకుండా నదికి ఎగువ భాగంలో ఇరువైపులా కలిసి సుమారు 50 కిలోమీటర్ల మేరకు భారీ ఎత్తున ఫ్లడ్‌బ్యాంక్ (కరకట్ట తరహాలో) నిర్మించనున్నారు. ఈ పనులు సైతం గత రెండు, మూడు నెలలుగా సాగుతున్నాయి. ప్రాజెక్టు కోసం ముందుగా 3,267 ఎకరాలు తీసుకున్నారు. తాజాగా సవరించిన అంచనాల మేరకు గోదావరి నదితో పాటు నదిలో కలిసే చిన్న, పెద్ద వాగుల మీద కూడా కరకట్టల నిర్మాణం చేపట్టాల్సి వస్తోంది. దీంతో అదనంగా దుమ్ముగూడెం, చర్ల, మణుగూరు, అశ్వాపురం మండలాల్లో 500 ఎకరాల భూసేకరణ చేయాల్సిన అవసరం ఏర్పడింది.

ఆరు బ్లాకుల్లో పనులు...

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని పొలాలకు గోదావరి నీటిని అందించేందుకు దుమ్ముగూడెం - అశ్వాపురం మధ్య గోదావరి నదిపై 1.5 కిలోమీటర్ల పొడవుతో సీతమ్మసాగర్ బ్యారేజీని రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తోంది. బ్యారేజీ డిజైన్ ప్రకారం 200 మీటర్ల వరకు జల విద్యుత్ కేంద్ర నిర్మాణం కోసం వదిలిపెట్టి, మిగిలిన 1.3 కి.మీ పొడవుతో బ్యారేజీ నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. ప్రస్తుతం ఉన్న కాటన్ బ్యారేజీ దిగువన 200 మీటర్ల దూరంలో మొత్తం ఆరు బ్లాకులుగా విభజించి నిర్మాణ పనులు చేపడుతున్నారు. ప్రస్తుతం ఒకటి నుంచి నాలుగు బ్లాకుల్లో పిల్లర్లు, స్పిల్‌వేల నిర్మాణం జరుగుతోంది. ఐదు, ఆరు బ్లాకుల్లో క్రస్ట్ గేట్లు బిగించే స్థాయి వరకు పనులు పూర్తయ్యాయి.

హెడ్ రెగ్యులేటరీ పనులు..

సీతమ్మ సాగర్‌కు సంబంధించిన తొలి పంప్‌హౌస్ (బీజీ కొత్తూరు)తో పాటు అక్కడి వరకు నీటిని తీసుకొచ్చే పది కిలోమీటర్ల పొడవైన గ్రావిటీ కెనాల్ పనులు ఎప్పుడో పూర్తయ్యాయి. పంప్‌హౌస్ దిగువ భాగంలోనూ కెనాల్ నిర్మాణం పూర్తయింది. అయితే గోదావరి నుంచి పంప్‌హౌస్‌కు నీటిని తరలించే హెడ్ రెగ్యులేటరీ పనులు ఇన్నాళ్లూ పూర్తి కాలేదు. దీంతో పంప్‌హౌస్ అందుబాటులోకి వచ్చినా ఏడాది కాలంగా ఎత్తిపోతలు లేవు. ప్రస్తుతం హెడ్ రెగ్యులేటరీ పనులు ప్రారంభమయ్యాయి. జూన్ నాటికి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

నేడు జిల్లాలోకి రేవంత్ యాత్ర



రాజీవ్‌నగర్ తండాలో రేవంత్ బసకు స్థలాన్ని పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

- ఇల్లెందు, భద్రాచలం సెగ్మెంట్లలో కొనసాగేలా ఏర్పాట్లు
- మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికే పరిమితం?
- యాత్రపై డీసీసీ నుంచి కానరాని స్పష్టత

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం : పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హాత్‌సే హాత్ జోడో పాదయాత్ర గురువారం రాత్రి ఉమ్మడి జిల్లాలోకి ప్రవేశించనుంది. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మీదుగా ఖమ్మం జిల్లా కామేపల్లి మండలానికి యాత్ర చేరుకుంటుంది. ఆ మరుసటి రోజు నుంచి రేవంత్ జిల్లాలో యాత్ర చేపడుతారు.

కామేపల్లి మీదుగా ఇల్లెందు..

పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ఈనెల 6న ములుగు జిల్లా మేడారంలో హాత్‌సే హాత్ జోడో యాత్రను ప్రారంభించారు. ముందుగా మహబూబాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో యాత్రను పూర్తి చేయాలని నిర్ణయించారు. అందులో భాగంగా గురువారం రాత్రి ఇల్లెందు నియోజకవర్గం కామేపల్లి మండలం లచ్చతండా వద్ద పాదయాత్ర ప్రవేశించనుండగా అక్కడే రాత్రి బస చేస్తారు. ఇక శుక్రవారం లచ్చతండా, బర్లగూడెం, పొన్నెకల్లు, బండిపాడు క్రాస్, గోవింద్రాల, పాత లింగాల వరకు యాత్ర చేపట్టి కొత్తలింగాలలో సభ అనంతరం ఇల్లెందు రాజీవ్‌నగర్ తండాలో రాత్రి బస చేయనున్నారు. అలాగే, 11వ తేదీ ఉదయం రాజీవ్‌నగర్ తండాలో ప్రజాసంఘాలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులతో ముఖాముఖిగా రేవంత్ మాట్లాడుతారు. అదేరోజు సాయంత్రం రాజీవ్‌నగర్, సట్‌ఫిట్ బస్తీ, డీఎస్పీ క్వార్టర్స్, గోవింద్ సెంటర్, కొత్త బస్టాండ్, పాత బస్టాండ్ మీదుగా జగదాంబ సెంటర్‌కు చేరుకుని కార్నర్ మీటింగ్ నిర్వహిస్తారు. అనంతరం జే.కే.కాలనీ, కరెంట్ ఆఫీస్ వరకు యాత్ర చేపట్టాక రోడ్డు మార్గంలో భద్రాచలం చేరుకుని రాత్రి బస చేస్తారు.

యాత్ర ఏర్పాట్లు

యాత్రకు రెండు రోజుల ముందే రూట్‌మ్యాప్ ఖరారు కావడంతో ఇల్లెందు నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఈమేరకు శుక్రవారం రాత్రి ఇల్లెందు మండలం రాజీవ్‌నగర్ తండా వద్ద రేవంత్ బస చేయనుండగా, ఏర్పాట్లను కాంగ్రెస్ నాయకులు బుధవారం పరిశీలించారు. కాంగ్రెస్ నాయకులు చీమల వెంకటేశ్వర్లు, లక్కినేని సురేందర్, భూక్యా దళ్‌సింగ్ నాయక్, రామచంద్రనాయక్, అజ్మీరా శంకర్ నాయక్, జి.రవి, కామేపల్లి జెడ్పీటీసీ ప్రవీణ్‌నాయక్, దొడ్డా డానియేల్, పులి సైదులు పాల్గొన్నారు.

చేతులు కలిసేనా?

పీసీసీ చీఫ్ యాత్రకు సంబంధించి రూట్‌మ్యాప్, ఏర్పాట్లు తదితర అంశాలపై డీసీసీ నుంచి స్పష్టమైన వివరాలు వెల్లడి కాలేదు. ఇల్లెందు నియోజకవర్గానికి సంబంధించి కొందరు నేతలు సోషల్ మీడియాలో మాత్రమే యాత్ర వివరాలను కొంత మేర తెలిపారు. ఇక భద్రాచలం, పినపాక నియోజకవర్గాల్లో యాత్ర రూట్‌మ్యాప్, ఎవరితో ములాఖాత్ అవుతారు, కార్నర్ మీటింగులు ఎక్కడనే అంశంపై స్పష్టత రాలేదు. దీంతో రేవంత్ చేపట్టిన యాత్రలోనూ కాంగ్రెస్ నేతలు ఒకరితో ఒకరు చేతులు కలిపే పరిస్థితి కనిపించడం లేదనే అభిప్రాయం ఆ పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతోంది. ఇప్పటికే వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గంలో పీసీసీ అధ్యక్షుడు యాత్ర చేపట్టలేకపోయారు. భద్రాద్రి జిల్లాలోనూ అదే తరహా పరిస్థితులు ఎదురవుతాయా అనే సందేహాలు నెలకొన్నాయి. యాత్ర ఆరంభం రోజున ములుగు జిల్లా మేడారంలో భద్రాద్రి కొత్తగూడెం డీసీసీ అధ్యక్షుడు, భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య హడావుడి చేశారు. ప్రస్తుతం ఆయన అసెంబ్లీ సమావేశాల నిమిత్తం హైదరాబాద్‌లో ఉన్నట్లు సమాచారం. మరోవైపు డీసీసీ అధ్యక్షుడికి పూర్తి సమాచారం ఇవ్వకుండానే కాంగ్రెస్‌లోని మరో వర్గం నేతలు యాత్ర ఏర్పాట్లు చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది.

బెల్లంపల్లి వరకే 'సింగరేణి'



కొత్తగూడెంఅర్బన్: భద్రాచలం రోడ్డు రైల్వే స్టేషన్ నుంచి ప్రతిరోజూ సిర్పూర్ కాగజ్‌నగర్‌కు వెళ్లే సింగరేణి రైలు ఈనెల 14 వరకు బెల్లంపల్లి వరకు మాత్రమే నడుస్తుందని రైల్వే అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వే ట్రాక్ పనులు జరుగుతున్నందున ఈ మార్పు చేశామని, ప్రయాణికులు గమనించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

బదిలీలకు దరఖాస్తు చేసుకోవాలి



విద్యార్థులకు సూచనలు చేస్తున్న డీఈఓ ప్రసాద్

కొత్తగూడెంఅర్బన్: 317 జీఓ ద్వారా వచ్చిన ఉపాధ్యాయులతో పాటు ఇతర జిల్లాల నుంచి వచ్చిన ఉపాధ్యాయులు సైతం బదిలీలకు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ ఎస్.ఎస్.ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల ఉపాధ్యాయులు ఈనెల 12 నుంచి 14 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. సంబంధిత హార్డ్ కాపీలను ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయులచే, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులచే తనిఖీ చేయించుకుని 14వ తేదీ సాయంత్రంలోగా ఎంఈఓ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. ఎంఈఓలు ఎక్సెల్ ఫార్మట్‌లో తయారుచేసి అదేరోజు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సమర్పించాలని ఆదేశించారు.

ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి

విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని డీఈఓ ప్రసాద్ సూచించారు. బుధవారం ఆయన రామవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. చదువు మాత్రమే మనిషికి మంచి జీవితాన్ని అందిస్తుందని, సరైన చదువు లేని వారిని సమాజం సరిగా గుర్తించదని అన్నారు. ప్రార్థన సమయానికి ముందే పాఠశాలకు చేరుకున్న ఆయన.. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. పిల్లల క్రమశిక్షణ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని హెచ్‌ఎంను ఆదేశించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను సందర్శించి.. విద్యార్థుల హాజరు శాతం తక్కువగా ఉండడంతో ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఈఓ వెంట అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎ.నాగరాజశేఖర్, జిల్లా సమ్మిళిత విద్య కో ఆర్డినేటర్ ఎస్‌కే సైదులు ఉన్నారు.

'కంటివెలుగు'ను సద్వినియోగం చేసుకోండి

డీఎంహెచ్ఓ శిరీష



పర్ణశాల పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ శిరీష

భద్రాచలం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్ఓ డాక్టర్ శిరీష అన్నారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో బుధవారం ఆమె కంటివెలుగు శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పని ఒత్తిడిలో ఉండే అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి కంటిచూపుపై ప్రభావం పడే అవకాశం ఉందని, అందరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అంధత్వం రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఎలాంటి ఇబ్బందులూ ఉండవన్నారు. వేల రూపాయలు ఖర్చుపెట్టి కంటి వైద్యం చేయించుకోలేని వారి కోసమే సీఎం కేసీఆర్ ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని చెప్పారు. ఈ శిబిరంలో ఐటీడీఏ కార్యాలయ అధికారులు, ఉద్యోగులు పరీక్షలు చేయించుకోగా, దృష్టిలోపం ఉన్నవారికి కళ్లజోళ్లు అందించారు. కార్యక్రమంలో కంటి వెలుగు క్యాంప్ అధికారి వినయ్, పీఎంఓ వినయ్‌కుమార్, హెచ్‌వీ సంధ్య వాణి, ఏఎన్‌ఎంలు నాగమణి, విజయలక్ష్మి, యాకూబ్ రెడ్డి, ఆశ వర్కర్లు రమాదేవి, పార్వతి పాల్గొన్నారు.

పర్ణశాల పీహెచ్‌సీ తనిఖీ..

దుమ్ముగూడెం: మండలంలోని పర్ణశాల పీహెచ్‌సీని డాక్టర్ శిరీష తనిఖీ చేశారు. వైద్యశాలలో అందుతున్న సేవలపై ఆరా తీశారు. పీహెచ్‌సీ సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని, ఆస్పత్రికి వచ్చే వారికి మెరుగైన చికిత్స చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామింగ్ అధికారి డాక్టర్ బాలాజీ నాయక్, డాక్టర్లు మణికంఠారెడ్డి, రేపాక చైతన్య, పీహెచ్‌సీ సిబ్బంది నాగేశ్వర్‌రావు, అనసూర్య, సుజాత, కృపారాణి, నాగరాజు పాల్గొన్నారు.

అందని సేవకూ పన్ను!

- గ్రామాల్లో గ్రంథాలయాలు లేకున్నా సెస్
- జిల్లాలో ఏటా రూ.కోటికి పైగా వసూలు
- జిల్లా కేంద్ర గ్రంథాలయానికి చెల్లించని స్థానిక అధికారులు

ఇల్లెందు రూరల్: ఏదైనా సేవ పొందితే అందుకు వినియోగదారులు రుసుం చెల్లించడం సహజం. కానీ అందని సేవలకూ రూ.లక్షల్లో రుసుం చెల్లించడం ఏంటని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని 481 గ్రామపంచాయతీలు, నాలుగు మున్సిపాలిటీల్లో పన్నులు భారీగా వసూలు చేస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో గ్రామపంచాయతీల ద్వారా రూ.13,93,95,876 పన్నులు వసూలు చేయాలని డిమాండ్ నోటీసులు పంపించారు. ఇక నాలుగు మున్సిపాలిటీల నుంచి సుమారు రూ. 4 కోట్ల మేర పన్నులు వసూలవుతాయి. ఈ మొత్తంలో 8 శాతం లైబ్రరీ పన్ను కింద జిల్లా గ్రంథాలయ ఖాతాలో అధికారులు జమ చేయాల్సి ఉంటుంది. అయితే గ్రంథాలయాలు ఉన్నచోట పన్ను చెల్లించడం సబబే అయినా లేని గ్రామాల్లోనూ అనేక ఏళ్లుగా 8 శాతం పన్నులు వేస్తుండడం గమనార్హం.

పేరుకుపోతున్న బకాయిలు

గతేడాది కూడా 8 శాతం చొప్పున రూ.కోటికి పైగా గ్రంథాలయ సెస్‌ను జిల్లా వాసులు చెల్లించారు. కానీ జిల్లా కేంద్ర గ్రంథాలయ ఖాతాలో మాత్రం రూ.75 లక్షలు మాత్రమే జమ చేశారు. అంటే మరో రూ.25లక్షలకు పైగా ఏమయ్యాయనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి కూడా గ్రంథాలయ సెస్ నిధులు తక్కువ మొత్తంలో జమ చేస్తున్నారని జిల్లా కేంద్ర గ్రంథాలయ శాఖ అధికారులు చెబుతున్నారు.

లైబ్రరీలు ఉన్నచోటా సేవలు అంతంతే..

జిల్లాలో 481 గ్రామపంచాయతీలు, నాలుగు మున్సిపాలిటీలకు గాను శాఖ గ్రంథాలయాలు 18 ఉండగా, ప్రస్తుతం 17 మాత్రమే పని చేస్తున్నాయి. వాటికి 14 చోట్ల పక్కా భవనాలు ఉండగా, నాలుగు చోట్ల భవనాలు లేవు. ఒకటి అద్దె భవనం, రెండు అద్దె లేకుండా ప్రైవేటు భవనాల్లో, గుండాలలో పంచాయతీ కార్యాలయంలో కొనసాగుతున్నాయి. ఇందులో గుండాల లైబ్రరీ ఆరేళ్ల క్రితమే మూతపడింది. ఆయా గ్రంథాలయాల్లో 40 మంది సిబ్బంది అవసరం కాగా, ప్రస్తుతం ముగ్గురు రెగ్యులర్, ఆరుగురు కాంట్రాక్టు పద్ధతిన విధులు నిర్వహిస్తున్నారు. దీంతో సేవలు అంతంతగానే అందుతున్నాయి.



ఇది గుండాల గ్రామపంచాయతీ కార్యాలయం. ఈ భవనంలో ఆరేళ్ల క్రితం శాఖ గ్రంథాలయం కొనసాగింది. భవనం ఇరుకుగా ఉండడంతో కొద్ది రోజుల పాటు అటవీ శాఖ కార్యాలయంలో నిర్వహించారు. అది కూలిపోవడంతో గ్రంథాలయాన్ని పూర్తిగా మూసేశారు. కానీ గుండాల మండలం నుంచి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇంటి పన్నుల రూపంలో రూ.6,06,638 ప్రజలు చెల్లించగా, అందులో 8 శాతం అంటే రూ.48,000 జిల్లా గ్రంథాలయానికి సెస్ రూపంలో చెల్లించారు. ఇలా ప్రతీ ఏటా వసూలైన ఇంటి పన్నుల నుంచి 8 శాతం చెల్లింపులు కొనసాగుతూనే ఉన్నాయి. కానీ గ్రంథాలయాన్ని మాత్రం పునరుద్ధరించలేదు.

8 శాతం సెస్ చెల్లించాలి

గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల్లో వసూలైన ఇంటి పన్నుల నుంచి 8 శాతం గ్రంథాలయ సెస్ చెల్లించాల్సి ఉంటుంది. ఈ నిబంధనను గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలు పూర్తిస్థాయిలో పాటించడం లేదు. గతేడాది కేవలం రూ.75 లక్షలు మాత్రమే జమ చేశారు.

– దిండిగాల రాజేందర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్

కౌన్సిలర్ల ఇంటి ఎదుట ఫ్లెక్సీలు, ఆందోళన

అవిశ్వాసం కోసం అమ్ముడుపోయారని బీఆర్‌ఎస్ నాయకుల ఆరోపణ



కౌన్సిలర్ ఇంటి ఎదుట ఆందోళనకు దిగిన బీఆర్‌ఎస్ శ్రేణులు

ఇల్లెందు: ఇల్లెందు మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం నోటీసు అందజేసి, వైజాగ్ క్యాంపునకు తరలివెళ్లిన 12 మంది కౌన్సిలర్లకు వ్యతిరేకంగా బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం నిరసన ర్యాలీ చేపట్టారు. అలాగే, కౌన్సిలర్లను ప్రలోభాలకు గురి చేశారంటూ ఆరోపణలు ఎదుర్కొంటున్న ముగ్గురు కౌన్సిలర్ల ఇంటి ఎదుట 'సేవ్ ఇల్లెందు.. బట్ నాట్ సేల్ ఇల్లెందు' పేరిట ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మనోహర్ తివారీ, పరుచూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. రూ.10 లక్షలకు కొందరు కౌన్సిలర్లు అమ్ముడుపోయి అవిశ్వాసానికి సిద్ధమయ్యారని ఆరోపించారు. కన్నతల్లి లాంటి పార్టీకి ద్రోహం చేసిన వారికి ప్రజలు బుద్ధి చెబుతారని తెలిపారు. విలువ లేని రాజకీయాలు చేస్తున్న కౌన్సిలర్లు వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ కౌన్సిలర్‌లు సయ్యద్ ఆజమ్, వార రవి, అంకెపాక నవీన్, నాయకులు పాల్గొన్నారు.

దమ్ముంటే బలం నిరూపించుకో

మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు (డీవీ)కి వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మానం పెట్టిన కౌన్సిలర్లు బుధవారం వీడియోలు రిలీజ్ చేశారు. తాము రూ. 10 లక్షలకు అమ్ముడుపోయామంటూ తమ ఇళ్ల ముందు ధర్నాలు చేయించడం ఏంటంటూ వీడియో మెసేజ్‌లో ప్రశ్నించారు. 'అవినీతికి నువ్వు పాల్పడి, అది ప్రశ్నించినందుకు మేం అమ్ముడుపోయాం' అంటూ నిందలు వేయడం ఏంటని నిలదీశారు. బినామీ కాంట్రాక్టర్లతో పనులన్నీ డీవీనే చేపడుతున్నాడని ఆరోపించారు. ఇదేం పద్ధతని ప్రశ్నించినందుకు తమ వార్డుల్లో కనీస స్థాయిలో కూడా పనులు చేపట్టడం లేదన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరిప్రియ నాయకత్వంలో పని చేసేందుకు రెడీగా ఉన్నామని చెప్పారు. డీవీకి దమ్ముంటే అవిశ్వాసాన్ని ఎదుర్కొని తన బలాన్ని నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. వీడియో రిలీజ్ చేసిన వాళ్లలో కొక్కు నాగేశ్వరరావు, సందబిందు, సిలివేరు అనిత, పాబోలు స్వాతి, చీమల సుజాత, వాంకుడోతు తార, తోట లలిత శారద, పత్తి స్వప్న ఉన్నారు. అసమ్మతి వర్గం కౌన్సిలర్లు ప్రస్తుతం యానాంలోని క్యాంపులో ఉన్నట్లు సమాచారం. వారంతా గురువారం ఇల్లెందు వస్తారని ప్రచారం జరుగుతోంది.

ఇద్దరిపై కిడ్నాప్ కేసు నమోదు

మున్సిపల్ బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ కొక్కు నాగేశ్వరరావు, 16వ వార్డు కౌన్సిలర్ గిన్నారపు రజిత, ఆమె భర్త రవిని కిడ్నాప్ చేశారని వారి బంధువులు బుధవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇల్లెందుకు చెందిన కొండపల్లి గణేష్, సిలివేరు సత్యనారాయణలను బాధ్యులుగా పేర్కొనడంతో కేసు నమోదు చేసినట్లు సీఐ రాజు తెలిపారు. కాగా, నాగేశ్వరరావు, రజిత, ఆమె భర్త యానాం క్యాంపులో ఉండగా, వారి బంధువులు మాత్రం కిడ్నాప్ అయినట్లు ఫిర్యాదు చేయడం గమనార్హం.

క్లుప్తంగా

రసాయన ఎరువులు తగ్గించాలి



సదస్సుకు హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

దమ్మపేట: పంటల సాగులో రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ లక్ష్మీనారాయణమ్మ సూచించారు. బుధవారం మండల పరిధిలోని మల్కారం గ్రామంలో నిర్వహించిన ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. రసాయన ఎరువుల వల్ల భూసారం తగ్గిపోతుందని తెలిపారు. జీవ ఎరువులే వాడాలని రైతులకు సూచించారు. ఉద్యానవన శాస్త్రవేత్త శివ మాట్లాడుతూ జీవామృతం, కషాయాలను వాడాలని చెప్పారు. అనంతరం మల్కారంలోని బుద్దే కోటేశ్వరరావు గోశాలను సందర్శించి, జీవామృతం తయారీ విధానాన్ని రైతులకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ రూప్‌సింగ్, అభ్యుదయ రైతు బుద్దే కోటేశ్వరరావు తదితర రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సింగరేణి నిధులు

మణుగూరుటౌన్: మణుగూరు ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(కో ఎడ్యుకేషన్) అభివృద్ధికి సింగరేణి సీఎస్ఆర్ నిధులు కేటాయించినట్లు ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు తెలిపారు. బుధవారం ఆయన వివరాలు వెల్లడించారు. భవనాల మరమ్మతులకు రూ.52.57లక్షలు మంజూరు చేస్తూ సింగరేణి యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు.

వలస కార్మికుడి మృతి



రమేష్ కుమార్ నాగ్ మృతదేహం

అశ్వారావుపేట: జామాయిల్ తోటలు నరికేందుకు వలసొచ్చిన ఓ కార్మికుడు అశ్వారావుపేట ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం ఉదయం మృతి చెందాడు. దీంతో ప్రయాణికులు గుర్తించి అశ్వారావుపేట ఎస్ఐ సాయి కిషోర్ రెడ్డికి సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న పోలీసులు మృతుని జేబులోని ఆధార్ కార్డు ఆధారంగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బస్తర్ జిల్లాకు చెందిన రమేష్ కుమార్ నాగ్(34)గా గుర్తించారు. అశ్వారావుపేటలోని వలస కార్మికుల బృందాలను విచారించగా మృతుడు జామాయిల్ తోటలు నరికేందుకు వచ్చినట్లు తేలింది. కూలీల మేస్త్రి మృతుడిని గుర్తించి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. తల్లిదండ్రులు అశ్వారావుపేట పోలీస్ స్టేషన్‌కు వచ్చిన తర్వాత ఫిర్యాదు స్వీకరించి కేసు నమోదు చేసి విచారణ చేపడతామని ఎస్ఐ తెలిపారు.

'ఉపాధి'లో అవకతవకలు

సుజాతనగర్: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం నుంచి జరిగిన ప్రజావేదిక రాత్రి కూడా కొనసాగి బుధవారం ఉదయం ముగిసింది. మండలంలోని 20 గ్రామ పంచాయతీల పరిధిలో 2020 జనవరి నుంచి 2022 మార్చి 31 వరకు (27 నెలల కాలంలో) రూ.13 కోట్లతో చేపట్టిన ఉపాధి పనుల్లో అవినీతి, అక్రమాలు వెలుగుచూశాయి. ఆయా గ్రామ పంచాయతీల పరిధిలో రూ.4,06,141 రికవరీకి అధికారులు ఆదేశించారు. వీటిలో రూ.19,200 జరిమానా విధించారు.145 పనులకు సంబంధించి షోకాజ్ నోటీసులు ఇస్తామని అధికారులు తెలిపారు. అడిషనల్ పీడీ సుబ్రమణ్యం, అంబుడ్స్‌మెన్ శ్రీనివాస్, ఏపీఎం వేణు, ఎంపీడీఓ టి.వెంకటలక్ష్మి, ఎస్ఆర్‌పీ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థి

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం ఎస్సీ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విష్ణు జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఆర్.బుచ్చయ్య తెలిపారు. ఈ నెల 10 నుంచి బిహార్ రాష్ట్రంలోని పాట్నాలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో విష్ణు పాల్గొంటాడని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విష్ణుకు బూట్లు అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వీరాంజనేయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

డివైడర్ ఎక్కిన ట్రాక్టర్

సత్తుపల్లిటౌన్: ఎదురుగా వెళ్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో అదుపుతప్పి ఓ ట్రాక్టర్ డివైడర్ ఎక్కిన ఘటన సత్తుపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. మండలంలోని బేతుపల్లి గ్రామానికి చెందిన రైతు ట్రాక్టర్‌లో పొలానికి కావాల్సిన ఎరువులను తీసుకెళ్తున్నాడు. బస్టాండ్ వైపు నుంచి పోతూ బాలాజీ థియేటర్ సమీపంలోకి రాగానే ఎదురుగా వెళ్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో ట్రాక్టర్ ఇంజిన్ అదుపుతప్పి డివైడర్ ఎక్కింది. అయితే, ఈ ఘటనలో ఎవరికీ ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,781

అధికారుల నిర్లక్ష్యం.. నిర్మాణాల్లో ఇష్టారాజ్యం

- బహుళ అంతస్తుల భవనాల్లో నిబంధనలకు నీళ్లు..
- మున్సిపల్, అగ్నిమాపక అనుమతులు తీసుకోని వైనం
- అక్రమ నిర్మాణాలపై చర్యలు చేపట్టని ఇరుశాఖలు

కొత్తగూడెంఅర్బన్: జిల్లా కేంద్రంలో బహుళ అంతస్తుల నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. నిబంధనలు పాటించకున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. కొత్తగూడెం మున్సిపాలిటీలో 2021లో టీఎస్ బిపాస్ అనుమతి లేకుండా చేపట్టిన నిర్మాణాలపై కలెక్టర్ నేతృత్వంలో ఏర్పాటైన టాస్క్‌ఫోర్స్ టీం దాడులు నిర్వహించింది. అనుమతులు లేని బహుళ అంతస్తుల నిర్మాణాలను పాక్షికంగా కూల్చివేసి, అక్కడ నోటీసులు అంటించింది. అనంతరం అధికారులు మున్సిపల్, టాస్క్‌ఫోర్స్ అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టవద్దని ఫ్లెక్సీలు సైతం ఏర్పాటు చేశారు. హడావిడి చేసిన అధికారులు ఆ ఫ్లెక్సీలు, టాస్క్‌ఫోర్స్ దాడులు కొద్ది రోజులకే నిలిపివేశారు. కూల్చివేతల్లో నిబంధనలు పాటించిన కొందరు పేదలు కూడా నష్టపోయారు. ఆ తర్వాత టాస్క్‌ఫోర్స్ చేతులు దులుపుకోవడంతో అక్రమార్కులకు అడ్డూఅదుపు లేకుండాపోయింది. కొత్తగూడెం మున్సిపాలిటీల్లో జి ప్లస్ టూ నిర్మాణాలకు మాత్రమే అనుమతి ఉంది. ఆపై అంతస్తులు నిర్మించాలంటే వరంగల్ నుంచి అనుమతులు తెచ్చుకోవాల్సి ఉంటుంది. కానీ కొందరు అక్రమార్కులు అవేమీ పట్టించుకోవడం లేదు. మున్సిపాలిటీలో తీసుకునే అనుమతి ఒకటి, నిర్మాణం చేసేది మరోలా ఉంటోంది. సెట్ బ్యాక్ లేకుండా నిర్మాణాలు చేస్తున్నారు. నిర్మాణాలన్నీ బహుళ అంతస్తుల కమర్షియల్ భవనాలు కావడంతో భవిష్యత్‌లో ప్రమాదాలు జరిగితే ప్రాణ, ధననష్టం భారీగా ఉంటుంది. ఇటీవల హైదరాబాద్‌లో బహుళ అంతస్తులో జరిగిన అగ్నిప్రమాదమే ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు.



అగ్నిమాపక శాఖ నుంచి అనుమతులు లేని బహుళ అంతస్తుల భవనం

కొన్ని నిర్మాణాలను పరిశీలిస్తే..

జిల్లా కేంద్రంలో గతంలో నిర్మించినా, ప్రస్తుతం నిర్మిస్తున్నా బహుళ అంతస్తులకు మున్సిపాలిటీలో రికార్డుల్లో అనుమతులు ఒకలా ఉంటే, నిర్మాణాలు మరోలా ఉన్నాయి. ఈ వ్యవహారంపై మున్సిపల్ అధికారులు, టాస్క్‌ఫోర్స్ బృందాలు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. బస్టాండ్ సెంటర్ సమీపంలో వైన్‌షాపు వెనుకభాగంలో, గొల్లగూడెంలో బార్ షాపు ఎదురుగా నిర్మిస్తున్న మరో బహుళ అంతస్తుల భవనాలకు, గణేష్‌టెంపుల్ ఏరియా, గణేష్ బస్తీ, బూడిదగడ్డలోని మహంకాళి టెంపుల్ సమీపంలో నిర్మాణం చేపట్టిన అపార్ట్‌మెంట్లకు, పాతకొత్తగూడెం ఏరియాలో కూడా నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవనాలకు అగ్నిమాపక కార్యాలయం నుంచి అనుమతులు తీసుకోలేదు. బహుళ అంతస్తులు నిర్మిస్తే భవనానికి మూడు వైపులా ఫైర్ ఇంజన్ తిరిగేలా స్థలం ఉండాలి. కానీ నిర్మాణదారులు ఇవేమీ పాటించడంలేదు. దీంతో భవిష్యత్‌లో అగ్నిప్రమాదాలు జరిగితే నష్టం ఎక్కువగా ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఇంతా జరుగుతున్నా మున్సిపల్, అగ్నిమాపక శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారే తప్ప చర్యలు తీసుకోవడం లేదు.

అనుమతులు తప్పనిసరి



మున్సిపాలిటీ పరిధిలో నిర్మాణం చేపట్టే బహుళ అంతస్తులకు సంబంధించి అనుమతులను తప్పనిసరిగా తీసుకోవాలి. మా పరిమితికి మించితే వరంగల్ నుంచి అనుమతులు తీసుకోవాలి. నిబంధనలు పాటించకుంటే తప్పనిసరిగా చర్యలు తీసుకుంటాం.

–రఘు, మున్సిపల్ కమిషనర్, కొత్తగూడెం

చర్యలు తీసుకుంటాం



కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లోని వైన్‌షాపు వెనుకభాగంలో, గొల్లగూడెం ఏరియాలోని ఓ బార్ షాపు సమీపంలో చేపట్టిన భవనాలకు ఎవరూ కూడా అగ్నిమాపక కేంద్రం నుంచి అనుమతులు తీసుకోలేదు. నిర్మాణాల్లో నిబంధనలు పాటించకపోతే నిర్మాణదారులపై చర్యలు తీసుకుంటాం.

–శ్రీనివాస్, కొత్తగూడెం ఫైర్ ఆఫీసర్

కూరగాయల సాగు లాభదాయకం

జిల్లా ఉద్యానవన అధికారి జినుగు మరియన్న

జూలూరుపాడు: వేసవి కూరగాయల సాగుకు అనుకూలం, లాభదాయకమని జిల్లా ఉద్యానవన అధికారి జినుగు మరియన్న సూచించారు. బుధవారం జూలూరుపాడులో మహిళా రైతు రాధమ్మ చేపట్టిన కూరగాయల పంటలను ఆయన పరిశీలించి, పలు సూచనలు చేశారు. కూరగాయల సాగు వల్ల ఎకరానికి రూ.50 వేల ఆదాయం వస్తుందని తెలిపారు. రైతులు ప్రస్తుతం కీర, దోస, బుడం, వంగ, ఆకు కూరలు పుదీనా, కొత్తిమీరతోపాటు చిక్కుడు, గోరు చిక్కుడు, మునగ తదితర కూరగాయలు సాగు చేయడానికి వాతావరణం అనుకూలంగా ఉంటుందన్నారు. రైతులు కూరగాయల సాగు చేపట్టాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగులో అంతర పంటల సాగుకు ప్రభుత్వం ఎకరానికి రూ.4,200 రాయితీ ఇస్తుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



మహిళా రైతులతో మాట్లాడుతున్న జిల్లా ఉద్యానవన అధికారి జినుగు మరియన్న

అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి

డీఎంఎస్(మైనింగ్) నోముల సంజీవ్‌కుమార్

మణుగూరుటౌన్: గనుల్లో భారీ యంత్రాల మధ్య పనిచేసే కార్మికులు, ఉద్యోగులు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని డీఎంఎస్(మైనింగ్) నోముల సంజీవ్‌కుమార్ సూచించారు. బుధవారం సింగరేణి మణుగూరు ఏరియాలో పర్యటించిన ఆయన తొలుత ఏరియా ఇన్‌చార్జి జీఎం జి.నాగేశ్వరరావుతో కలసి ఉపరితల గనులను పరిశీలించారు. పీకే ఓసీ వ్యూపాయింట్ నుంచి బొగ్గు ఉత్పత్తి ప్రక్రియను పర్యవేక్షించారు. ఓసీ–4గనిని పరిశీలించారు. ఉపరితల గనుల్లో తీసుకుంటున్న రక్షణ చర్యలపై ఆరా తీశారు. అనంతరం జీఎం కార్యాలయంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో మాట్లాడారు. రక్షణ చర్యలు నిరంతరం కొనసాగించాలని సూచించారు. కంపెనీ వ్యాప్తంగా ఎస్ఓపీ క్రియాత్మకంగా అమలు చేసి ప్రమాదాలు తగ్గించిన పరిస్థితిని గుర్తు చేస్తూ, అదే స్ఫూర్తిని కొనసాగించాలని చెప్పారు. రక్షణపై తరచూ అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. అనంతరం ప్రైవేటు కాంట్రాక్టర్లతో మాట్లాడుతూ ఓబీ వెలికితీత పనులు ప్రమాదరహితంగా సకాలంలో జరిగేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో అధికారులు రమేష్, లక్ష్మీపతిగౌడ్, ఎం.నర్సిరెడ్డి, వెంకటరమణ, వీరభద్రుడు, రాముడు, లింగబాబు, మదర్‌సాహెబ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంఎస్ సంజీవ్‌కుమార్

ఇంటి వెనకాలే గంజాయి సాగు!

- 10 కేజీల గంజాయి స్వాధీనం
- నాటేందుకు సిద్ధంగా ఉన్న నారు ధ్వంసం

గుండాల: ఆళ్లపల్లి మండలంలో గంజాయి సాగు కలకలం రేపింది. గంజాయి మత్తుకు అలవాటు పడిన ఓ రైతు ఏకంగా సాగు చేపట్టాడు. బుధవారం పోలీసులు ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. రూ. 1.34 లక్షల విలువైన 10 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. టేకులపల్లి సీఐ ఇంద్రసేనారెడ్డి, ఆళ్లపల్లి ఎస్సై రతీష్ కథనం ప్రకారం... ఆళ్లపల్లి మండలంలోని పాతూరు గ్రామానికి రైతు గొగ్గెల హన్మంతు గతంలో ఇతర రాష్ట్రాల్లో కూలి పనులకు వెళ్లేవాడు. ఈ క్రమంలో గంజాయికి అలవాటు పడ్డాడు. తానే సాగు చేసి, విక్రయించి డబ్బు సంపాదించుకోవచ్చనే తలంపుతో ఇతర రాష్ట్రాల నుంచి విత్తనాలు తెచ్చి ఇంటి వెనుకాల సాగు చేపట్టాడు. పంట చేతికొచ్చాక తన అన్నకొడుకు జనార్దన్ విక్రయించేవాడు. వచ్చిన నగదు ఇద్దరూ పంచుకునేవారు. పక్కా సమాచారంతో పోలీసులు బుధవారం గ్రామానికి వెళ్లగా గమనించిన జనార్దన్ గంజాయితో పారిపోయేందుకు ప్రయత్నించాడు. పోలీసులు పట్టుకుని విచారించారు. అతను వెల్లడించిన వివరాలతో ఇంటికి వెళ్లి హన్మంతును కూడా అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఎండు గంజాయి నాలుగున్నర కేజీలు, పచ్చి గంజాయి ఐదున్నర కేజీలు స్వాధీనం చేసుకున్నారు. ఇంటి పెరట్లో ఉన్న మొక్కలను సైతం ధ్వంసం చేశారు. పంచనామా నిర్వహించి నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి మొక్కలు

వివాహిత ఆత్మహత్య

వైరారూరల్: అనారోగ్య సమస్యలు తాళలేక వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని రెబ్బవరం గ్రామానికి చెందిన షేక్ నజియా (25) కొన్నేళ్లుగా బీపీ, షుగర్, థైరాయిడ్, నరాల బలహీత సమస్యలతో బాధపడుతోంది. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నా ఫలితం లేకపోవడంతో బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయాన ఆమె ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. నజియాకు భర్త, తొమ్మిదేళ్ల కుమార్తె ఉన్నారు. ఆమె తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శాఖమూరి వీరప్రసాద్ తెలిపారు.

ఎదురుకాల్పుల్లో తప్పించుకున్న మావోయిస్టులు

- ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో ఘటన..

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో బుధవారం మధ్యాహ్నం జరిగిన ఎదురుకాల్పుల్లో పలువురు మావోయిస్టులు తప్పించుకోగా, వారికి సంబంధించిన సామగ్రి పెద్దఎత్తున లభ్యమైంది. బీజాపూర్ జిల్లా తెర్రెం పోలీస్ స్టేషన్ పరిధిలో గల గుండం–చుత్వాయి గ్రామాల మధ్యలోని అటవీ ప్రాంతంలో మావో యిస్టులు సంచరిస్తున్నారనే నిఘా వర్గాల సమాచారం మేరకు జిల్లాకు చెందిన డీఆర్‌జీ, ఎస్టీఎఫ్, కోబ్రా బలగాలు మంగళవారం రాత్రి నుంచి కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో పోలీసు బలగాలకు తారసపడిన మావోయిస్టులు పోలీసుల పైకి కాల్పులు జరపగా పోలీసులు సైతం ఎదురుకాల్పులకు దిగారు. హోరా హోరీగా జరిగిన కాల్పుల్లో మావోయిస్టులు తప్పించుకుని పారిపోగా, ఆ ప్రాంతంలో కొందరు ఆదివాసీలు అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. కాల్పులు జరిగిన ప్రాంతంలో మావోయిస్టులకు సంబంధించిన సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తప్పించుకున్న మావోయిస్టుల కోసం అదనపు బలగాలను రంగంలోకి దించి కూంబింగ్ ముమ్మరం చేశారు.

వాహనాలపైకి దూసుకెళ్లిన ఇసుక లారీ

- ఒకరు మృతి, నలుగురికి గాయాలు
- నుజ్జునుజ్జయిన కారు, మోటార్‌సైకిళ్లు



ప్రమాదానికి కారణమైన లారీ

బూర్గంపాడు: అతివేగం, నిర్లక్ష్యం ఓ నిండు ప్రాణాన్ని బలిగొంది. బతుకుదెరువు కోసం కూలిపనులకు వెళ్లి వస్తున్న ఓ యువకుడిని ఇసుక లారీ పొట్టనబెట్టుకుంది. మరో నలుగురిని ఆస్పత్రి పాల్జేసింది. ఇసుక లారీ సృష్టించిన బీభత్సానికి పినపాక పట్టీనగర్‌కు సమీపంలోని కిన్నెరసాని బ్రిడ్జి వద్ద కొద్దిసేపు భయానక వాతావరణం ఏర్పడింది. పినపాక పట్టీనగర్ గ్రామానికి సమీపంలోని కిన్నెరసాని బ్రిడ్జి వద్ద ముందు వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఇసుక లారీ ఎదురుగా వస్తున్న వాహనాలపైకి దూసుకెళ్లింది. ఓ కారును, మరో రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొట్టింది. అనంతరం పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో పాల్వంచ మండలం బండ్రిగొండ గ్రామానికి చెందిన నెల్లెల రంజిత్(28) అక్కడికక్కడే మృతిచెందాడు. రంజిత్ బతుకుదెరువు కోసం వచ్చి మోరంపల్లిబంజరలో ఉంటూ తాపీ పనులు చేసుకుంటున్నాడు. బుధవారం ఉదయం పాల్వంచకు తాపీ పనులకు వెళ్లి మోటార్‌సైకిల్‌పై తిరిగి వస్తున్న క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. పినపాక పట్టీనగర్ గ్రామానికి చెందిన అప్పారావు, హరీష్‌లు సైతం పాల్వంచ తాపీ పనులకు వెళ్లి మరో మోటార్‌సైకిల్‌పై తిరిగి వస్తున్న క్రమంలో ప్రమాదానికి గురయ్యారు. వీరికి గాయాలవటంతో స్థానికులు పాల్వంచ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ ఘటనలో తొలుత ఇసుక లారీ ఢీ కొట్టిన కారులోని ఇద్దరికి కూడా గాయాలయ్యాయి. కారు, రెండు మోటార్‌సైకిళ్లు ఈ ఘటనలో పూర్తిగా దెబ్బతిన్నాయి. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. ఈ ఘటనతో భద్రాచలం– పాల్వంచ రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయింది. ప్రమాద సమాచారం తెలుసుకున్న ఎస్ఐ సంతోష్ అక్కడకు చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



దెబ్బతిన్న కారు



ప్రమాదంలో తుక్కుతుక్కయిన బైక్

పురుగులమందు తాగి దంపతుల ఆత్మహత్య



నాగేశ్వరరావు, శ్రీకళ మృతదేహాలు

తొలుత బంధువుకు వీడియో కాల్

మధిర: ఆర్థిక ఇబ్బందులో లేక ఇంకా ఏమైనా కారణాలు ఉన్నాయో తెలియదు కానీ ఖమ్మం జిల్లా మధిర మండలం మాటూరుకు చెందిన దంపతులు పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. మాటూరుకు చెందిన పుట్టా నాగేశ్వరరావు(36) – శ్రీకళ (30) దంపతులు సుమారు నాలుగేళ్లుగా ఖాజీపురం సమీపాన ఇటుకల పరిశ్రమలో కూలి పనులు చేశారు. అక్కడి నుంచి మూడు నెలల కిందట ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం శివగిరి వెళ్లి కూలి పనులు చేసుకుంటున్నారు. అదే జిల్లా వత్సవాయి మండలం కాకరవాయికి చెందిన బంధువుకు వేములనర్వ సమీపంలోని ఒక సుబాబుల్ తోట నుంచి రెండు రోజుల కిందట వీడియో కాల్ చేసి నీళ్ల, కూల్‌డ్రింక్ బాటిళ్ల చూస్తూ అందులో పురుగుల మందు కలిపి తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు చెప్పారని తెలిసింది. సదరు బంధువు ఫిర్యాదుతో గాలిస్తుండగా వారి మృతదేహాలను బుధవారం గుర్తించారు. కాగా, దంపతుల ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. మృతులకు ఇద్దరు కుమారులు ఉండగా, మాటూరులో నాయనమ్మ వద్ద ఉండి అదే గ్రామంలో చదువుకుంటున్నారు.

నాన్నా.. నీకేమైందిరా ?

- కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న అఖిల్ తల్లిదండ్రులు
- అమెరికాలో కన్నుమూసిన మధిర విద్యార్థి
- ఫోన్‌లో పరామర్శించిన ఎంపీ నామా

మధిర: చేతికంది వచ్చిన కుమారుడు.. తల్లిదండ్రులు పడుతున్న కష్టం చూడలేక తాను స్థిరపడగానే అండగా నిలుస్తానని ఫోన్‌లో తరచుగా చెప్పేవాడు. కానీ ఇప్పుడు ఆ కుమారుడే కన్నుమూశాడని తెలియడంతో తల్లిదండ్రులు రోదిస్తున్న తీరు అందరినీ కంటతడి పెట్టిస్తోంది. ఎలా జరిగిందో, ఏం జరిగిందో పూర్తిగా తెలియకపోగా.. దేశం కాని దేశంలో కన్నుమూసిన కుమారుడిని చివరి చూపు చూడడానికి ఇంకా ఎన్నాళ్లు పడుతుందో తెలియక ఆ తల్లిదండ్రులు కనిపించినవారినల్లా పట్టుకుని వివరాలు కోసం ప్రాధేయపడుతున్నారు. అమెరికాలో ఉన్నత విద్య పూర్తికాగానే పెళ్లి చేద్దామనుకుని భావిస్తుండగా ఇంతలోనే మృతి చెందినట్లు సమాచారం అందడం వారిని శోకసంద్రలోకి నెట్టింది.

అసలేం జరిగిందో...

మధిర పట్టణానికి చెందిన మహంకాళి ఉమాశంకర్ – మాధవి దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరు కొన్నాళ్ల క్రితం హైదరాబాద్ వెళ్లి కిరాణం షాపు ఏర్పాటుచేయగా, కరోనా సమయాన ఇబ్బందులతో మూసివేశారు. వీరిలో పెద్ద కుమారుడు అఖిల్ శ్రావిక్ (సాయి) బీటెక్ హైదరాబాద్‌లో పూర్తిచేశాక ఉన్నత విద్య కోసం 2021 డిసెంబర్‌లో అమెరికా వెళ్లాడు. అక్కడి అలబామా స్టేట్ మాంట్‌గోమేరిలోని అబర్న్ యూనివర్సిటీలో ఎమ్మెస్ చదువుతూనే ఒక స్టోర్‌లో పార్ట్ టైం ఉద్యోగం చేస్తున్నాడు. అఖిల్ స్నేహితుడు రవితేజ కూడా అదే స్టోర్‌లో పనిచేస్తున్నాడు. అక్కడ ఉన్న సెక్యూరిటీ గార్డు వద్ద ఉన్న గన్‌ను సోమవారం పరిశీలిస్తుండగా మిస్ ఫైర్ జరగడంతో అఖిల్ శ్రావిక్‌కు తీవ్రగాయాలయ్యాయి. దీంతో ఆయనను సమీప ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. అయితే, పొరపాటుగా ఘటన జరిగిందా, ఇంకా ఏమైనా కారణాలు ఉన్నాయా అనే అంశంపై అక్కడి పోలీసులు రవితేజతో పాటు స్టోర్ సిబ్బంది పలువురిని విచారిస్తున్నట్లు తెలిసింది. రక్తసంబంధీకులు ఉంటేనే మృతదేహాన్ని అప్పగిస్తామని చెప్పడంతో వీడియో కాల్ ద్వారా అఖిల్ స్నేహితుడు ఆయన తల్లిదండ్రులతో మాట్లాడించడంతో పోలీసులు పోస్టుమార్టం ప్రక్రియ ప్రారంభించినట్లు సమాచారం అందింది. పోస్టుమార్టం నివేదిక వచ్చాక, సీసీ కెమెరాల పుటేజీ పరిశీలించి ఘటనకు కారకులెవరో పోలీసులు నిర్ధారణకు వచ్చే అవకాశముందని సమాచారం.



విలపిస్తున్న అఖిల్ తల్లిదండ్రులు ఉమాశంకర్ – మాధవి



అఖిల్ శ్రావిక్ (ఫైల్)

మాకు దిక్కెవరు?

అఖిల్‌కు మొదటి నుంచి ఎవరితో వివాదం లేదని.. సాయం చేసే గుణం తప్ప ఎవరికీ అన్యాయం చేయడని తల్లిదండ్రులు చెబుతున్నారు. ఉన్నత విద్య పూర్తి చేసుకుని రాగానే పెళ్లి చేయాలని తల్లిదండ్రులు ఆలోచిస్తుండగా మృతి చెందాడనే సమాచారంతో వారు తల్లడిల్లుతున్నారు. బంధువులు వచ్చి ఉమాశంకర్, మాధవిని పరామర్శిస్తుంటే.. చేతికి అంది వచ్చిన కొడుకు కాటికి వెళ్తున్నాడు.. ఇక మాకు దిక్కెవరు.. మేము ఎలా బతకాలంటూ వారు రోదిస్తున్న తీరు అందరినీ కంట తడి పెట్టిస్తోంది. చదువు పూర్తికాగానే ఉద్యోగంలో చేరి కుటుంబానికి అండగా నిలుస్తానని చెప్పే కుమారుడు ఇప్పుడు విగతజీవిగా వస్తున్నాడని తెలుసుకున్న వారి రోదనలకు అంతు లేకుండాపోయింది. కాగా పలువురు ప్రజాప్రతినిధులు, పోలీస్ అధికారులు, తానా బృందం, ఎన్నారైలు, మృతదేహాన్ని స్వస్థలానికి పంపించే యత్నాల్లో నిమగ్నమైనట్లు సమాచారం.

క్లుప్తంగా...

జూన్ కల్లా 76 మెగావాట్ల నిర్మాణం

నిర్మాణ ఏజెన్సీలతో సింగరేణి చైర్మన్ శ్రీధర్



సాక్షి, హైదరాబాద్: 76 మెగావాట్ల సామర్థ్యానికి సంబంధించి సింగరేణి సంస్థ నిర్మిస్తున్న ఐదు ప్లాంట్లను మే నెల కల్లా పూర్తి చేసి.. జూన్ నెలలో తెలంగాణ ట్రాన్స్‌కోకు అనుసంధానం చేయాలని సంస్థ చైర్మన్ ఎన్.శ్రీధర్ నిర్మాణ ఏజెన్సీలను ఆదేశించారు. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో బుధవారం నిర్వహించిన సోలార్ విద్యుత్ సమీక్ష సమావేశంలో ఆయన కొత్త ప్లాంట్ల నిర్మాణాలపై లోతుగా చర్చించారు. సంస్థ చేపట్టిన మొత్తం 300 మెగావాట్ల సామర్థ్యం గల ప్లాంట్లలో ఇప్పటికే 224 మెగావాట్ల సామర్థ్యం గల 9 ప్లాంట్లను విజయవంతంగా పూర్తి చేశామని చెప్పారు. మిగిలిన ఆ 76 మెగావాట్ల సోలార్ నిర్మాణం నిర్ణీత సమయానికి పూర్తి చేయాలన్నారు. డైరెక్టర్ (ఈ అండ్ ఎం) డి సత్యనారాయణరావు ముందుగా నిర్మాణంలో ఉన్న ప్లాంట్ల గురించి వివరించారు. దీనిపై నిర్మాణ ఏజెన్సీల ప్రతినిధులతో శ్రీధర్ నేరుగా చర్చించారు. కాలపరిమితులు నిర్ణయించుకొని, రోజుకు రెండు షిఫ్టులలో పనులు పూర్తి చేయాలన్నారు.

కొండగట్టు ఆలయ అభివృద్ధికి రూ.100 కోట్లు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజనేయస్వామి దేవాలయ అభివృద్ధి కోసం రూ.100 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని ముత్యంపేట గ్రామంలో ఉన్న ఈ దేవాలయ అభివృద్ధి కోసం ప్రత్యేక అభివృద్ధి నిధి (ఎస్‌డీఎఫ్) కింద ఈ నిధులను మంజూరు చేస్తూ ప్రణాళిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ దేవాలయ అభివృద్ధి కోసం నిధులు ఇస్తానని సీఎం కేసీఆర్ గతేడాది డిసెంబర్‌లో హామీ ఇచ్చిన విషయం తెలిసిందే.

కొత్తగా 2 కరోనా కేసులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బుధవారం 3,688 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా, వారిలో ఇద్దరు వైరస్ బారిన పడ్డారు. దీంతో రాష్ట్రంలో ఇప్పటి వరకు నమోదైన మొత్తం కరోనా కేసుల సంఖ్య 8.41 లక్షలకు చేరింది. ఒక్కరోజులో ఇద్దరు కోలుకోగా, ఇప్పటి వరకు కోలుకున్నవారి సంఖ్య 8.37 లక్షలకు చేరింది. ప్రస్తుతం 27 మంది చికిత్స పొందుతున్నట్లు ప్రజారోగ్య సంచాలకుడు శ్రీనివాసరావు వెల్లడించారు.

పెళ్లికి పెద్ద సాయం

- రేపు 'వైఎస్సార్ కల్యాణ మస్తు'.. 'షాదీ తోఫా'
- పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఏపీ సర్కారు సాయం
- కొత్తగా తాడేపల్లిగూడెం రెవెన్యూ డివిజన్‌కు ఆమోదం
- ఏపీ మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం



సాక్షి, అమరావతి: నిరుపేద తల్లిదండ్రులకు ఆడపిల్లల పెళ్లిళ్లు భారం కారాదనే ఉద్దేశంతో 'వైఎస్సార్ కల్యాణ మస్తు', 'షాదీ తోఫా'పథకాల అమలుకు ఏపీ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ నెల 10వ తేదీన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు భవన నిర్మాణ కార్మికులు, విభిన్న ప్రతిభావంతుల్లో దరఖాస్తు చేసుకున్న 4,536 కుటుంబాలకు ఆర్థిక సాయం కింద రూ.38.18 కోట్లు పంపిణీ చేయనుంది. గతంతో పోలిస్తే సాయం మొత్తాన్ని భారీగా పెంచింది. ఈ క్రమంలో కల్యాణమస్తు, షాదీ తోఫా పథకాల కోసం దరఖాస్తు చేసుకునే వధూవరులకు 10వ తరగతి ఉత్తీర్ణతను తప్పనిసరి చేసింది. గత అక్టోబరు నుంచి డిసెంబరు వరకు జరిగిన వివాహాలకు సంబంధించి అందిన దరఖాస్తులను జనవరిలో తనిఖీ చేసి ఫిబ్రవరిలో ఆర్థిక సాయం చెల్లించనుంది. ప్రతి మూడు నెలలకు ఒకసారి దరఖాస్తులను పరిశీలించి నాలుగో నెలలో లబ్ధి అందించనుంది. మరోవైపు చంద్రబాబు తన హయాంలో నమ్మించి నట్టేట ముంచిన పొదుపు సంఘాల్లోని 79 లక్షల మంది అక్కచెల్లెమ్మలను ఆదుకుంటూ 3వ విడత వైఎస్సార్ ఆసరా కింద రూ.6,500 కోట్ల పంపిణీకి మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం వెలగపూడిలోని తాత్కాలిక సచివాలయంలో మంత్రివర్గం సమావేశమైంది. సంక్షేమం, విద్య, పరిశ్రమలకు ప్రోత్సాహకం, ఆరోగ్యం తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. సమాచార, బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ వాటిని మీడియాకు వెల్లడించారు. ఆ వివరాలు ఇవీ..

- ఫిబ్రవరి 24న రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, వైఎస్సార్ రైతు భరోసా - పీఎం కిసాన్.
- అక్టోబరు – డిసెంబరు త్రైమాసికానికి సంబంధించి జగనన్న విద్యాదీవెన ద్వారా ఫిబ్రవరి 28న పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను చెల్లించనుంది.
- ఉగాది సందర్భంగా మూడో విడత వైఎస్సార్ ఆసరా పంపిణీకి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. 10-04-2019 నాటికి పొదుపు సంఘాల మహిళలకు చంద్రబాబు ప్రభుత్వం ఎగ్గొట్టిన బకాయిలు రూ.25 వేల కోట్లు చెల్లిస్తానని పాదయాత్రలో సీఎం జగన్ ప్రకటించారు. మాట ప్రకారం ఇప్పటికే దాదాపు రూ.13 వేల కోట్లకు పైగా అందించారు. తాజాగా మరో రూ.6,500 కోట్లు ఇవ్వనున్నారు.
- జగనన్న వసతి దీవెన కింద ఈ ఏడాదికి సంబంధించి దాదాపు 10.50 లక్షల మంది విద్యార్థులకు మేలు చేస్తూ ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.20 వేల వరకూ సాయం అందించనుంది. జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం కింద ఇప్పటివరకు క్యూఎస్ ర్యాంకింగ్ టాప్ 200 విశ్వవిద్యాలయాలను పరిగణనలోకి తీసుకోగా తాజాగా 320కి పెంచారు. ఇకపై దాదాపు 21 సబ్జెక్టులకు సంబంధించి టాప్ 50 కాలేజీలు లేదా విద్యాసంస్థల్లో సీటు సాధించిన వారికి జగనన్న విదేశీ విద్యాదీవెన వర్తించనుంది.
- కర్నూలులో 50 ఎకరాల్లో రెండో జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం(ఎన్‌ఎల్‌యూ) ఏర్పాటు ప్రతిపాదనకు మంత్రి మండలి ఆమోదం.

మరిన్ని వార్తలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి



హైదరాబాద్‌లో బుధవారం జరిగిన జడ్చర్ల ఎమ్మెల్యే సి. లక్ష్మారెడ్డి కుమారుడు స్వరణ్ వివాహ వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు. చిత్రంలో మంత్రులు వి. శ్రీనివాస్ గౌడ్, సీహెచ్ మల్లారెడ్డి, ప్రభుత్వ విప్ బాల్క సుమన్, ఎమ్మెల్సీలు శేరి సుభాష్‌రెడ్డి, పాడి కౌశిక్ రెడ్డి, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, ఎ. జీవన్‌రెడ్డి, గణేశ్ బిగాల, కాలె యాదయ్య తదితరులు.

'ఎర' కేసు విచారణ 17న

హైకోర్టు ఆదేశాలపై స్టే, స్టేటస్‌కోకు నిరాకరించిన సీజేఐ



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ ఎమ్మెల్యేల ఎర కేసు విచారణ ఈ నెల 17న చేపట్టనున్నట్లు సుప్రీంకోర్టు పేర్కొంది. తెలంగాణ హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యవసరంగా విచారించాలని తెలంగాణ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూత్రా బుధవారం సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహా, జస్టిస్ జేబీ పార్దీవాలాలతో కూడిన ధర్మాసనం ముందు ప్రస్తావించారు. ఇదే అంశాన్ని మంగళవారం సీనియర్ న్యాయవాది దవే ప్రస్తావించారని గుర్తుచేశారు. హైకోర్టు ఉత్తర్వులపై స్టే లేదా స్టేటస్‌కో విధించాలని అభ్యర్థించారు. కేసు దర్యాప్తు సీబీఐకు అప్పగిస్తే నీరుగారిపోతుందని తెలిపారు. దీనిపై స్పందించిన సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్.. స్టే లేదా స్టేటస్‌కో ఇవ్వడానికి నిరాకరించారు. ఈ నెల 17న విచారణ చేపడతామని ఆ సమయంలో అన్ని అంశాలు పరిశీలిస్తామన్నారు. అయితే విచారణ ఈనెల 13న చేపట్టాలని లూత్రా పలుమార్లు ధర్మాసనానికి విజ్ఞప్తి చేశారు. ఈనెల 17నే విచారణ చేపడతామని ధర్మాసనం స్పష్టం చేసింది.

అది ట్యాపింగ్ కాదు..

రికార్డింగ్ వాయిస్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న లంకా రామశివారెడ్డి


- ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నా స్నేహితుడే
- నాకు వచ్చే ప్రతి ఫోన్ కాల్ ఆటోమేటిక్‌గా రికార్డ్ అవుతుంది
- చెన్నైలో ఉన్నప్పుడు ఆ రికార్డింగ్ వాయిస్‌ను నా స్నేహితుడికి పంపాను
- అది వైరల్ అయ్యి.. ఇంత రాద్ధాంతం అవుతుందని అనుకోలేదు
- కోటంరెడ్డి ఆరోపణలను కొట్టిపారేసిన స్నేహితుడు లంకా రామశివారెడ్డి

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: తన ఫోన్‌ను ప్రభుత్వం ట్యాపింగ్ చేసిందంటూ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చేసిన ఆరోపణలను ఆయన స్నేహితుడు లంకా రామశివారెడ్డి కొట్టిపారేశారు. అది ఫోన్ ట్యాపింగ్ కాదని.. ఫోన్‌లో తాను రికార్డ్ చేసిన వాయిస్ మాత్రమేనని స్పష్టం చేశారు. రామశివారెడ్డి బుధవారం నెల్లూరులో మీడియాతో మాట్లాడారు. 'నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నా స్నేహితుడే. డిసెంబర్‌లో నెల్లూరు కలెక్టర్ కార్యాలయంలో మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కోటంరెడ్డి ప్రభుత్వ అధికారుల మీద, ఆయనకు కలిగిన ఇబ్బందుల మీద సుదీర్ఘంగా మాట్లాడారు. అదే రోజు రాత్రి 7 నుంచి 8 గంటల మధ్య కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నాకు ఫోన్ చేశాడు. కలెక్టర్ కార్యాలయంలో జరిగిన సమావేశం విషయాలపై చర్చించుకున్నాం. రాష్ట్ర ప్రభుత్వం, అధికారుల విషయంలో తొందరపాటుగా మాట్లాడకుండా ఉంటే బాగుండేదని సలహా ఇచ్చాను. నియోజకవర్గ నిధులు, కాంట్రాక్టు పనులు, ఇతర పరిణామాలన్నీ సుదీర్ఘంగా చర్చించుకున్నాం. అవన్నీ కూడా నా ఫోన్‌లో ఆటోమెటిక్‌గా రికార్డయ్యాయి. నేను చెన్నై వెళ్లినప్పుడు.. కోటంరెడ్డితో ఫోన్‌లో మాట్లాడిన వాయిస్ రికార్డును నా స్నేహితుడికి పంపాను. అది యాదృచ్ఛికంగా జరిగిందే తప్ప.. కావాలని చేసింది కాదు. ఆ తర్వాత అది కాస్తా వైరల్ అయ్యింది. ఇంత పెద్ద వివాదం అవుతుందని ఊహించలేదు. కోటంరెడ్డి అనవసరంగా చిన్న విషయంపై ఇంత రాద్ధాంతం చేస్తాడని అనుకోలేదు. రెండు, మూడు రోజుల్లో సమసిపోతుందనుకున్నా. అందుకే ఇంతకాలం బయటకు రాలేదు. కానీ కోటంరెడ్డి కేంద్ర హోం శాఖకు ఫిర్యాదు చేస్తానని చెప్పడంతో నాకు కొంత ఆందోళన కలిగింది.

ప్రజలకు వాస్తవాలు తెలియాలనే ఇప్పుడు బయటకు వచ్చా. కోటంరెడ్డి కేంద్ర హోం శాఖకు ఫిర్యాదు చేసినా ఫర్వాలేదు. నాది ఆండ్రాయిడ్ ఫోన్. ప్రతి ఫోన్ కాల్ రికార్డ్ అవుతుంది. గత 5 నెలలుగా నేను వాడుతున్న ఫోన్‌ను చెక్ చేసుకోండి. అన్ని కాల్స్ రికార్డ్ అయిన విషయం తెలుస్తుంది. ఎవరు వచ్చినా.. నా ఫోన్ ఇస్తా.. ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించి నిజాలు తెలుసుకోవచ్చు. నేను వాయిస్ రికార్డు పంపిన నా స్నేహితుడి పేరును విచారణ అధికారులకు చెబుతా. ఆయన పేరు ఇప్పుడు బహిరంగంగా చెప్పి.. ఇబ్బంది పెట్టడం నాకు ఇష్టం లేదు'అని లంకా రామశివారెడ్డి వివరణ ఇచ్చారు.

ప్రభుత్వ వినతి తిరస్కృతి

- ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో ప్రభుత్వ అభ్యర్థనను తిరస్కరిస్తూ హైకోర్టు ఉత్తర్వులు



సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో సీబీఐ దర్యాప్తునకు ఆదేశించిన తీర్పు అమలును నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని, సుప్రీంకోర్టులో అప్పీల్ దాఖలు చేసే వరకు హైకోర్టు తీర్పును యథాతథంగా ఉంచాలని ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టాయి. సింగిల్ జడ్జి వద్ద దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌ను విచారణకు అనుమతించాలని కోరుతూ ప్రభుత్వం ద్విసభ్య ధర్మాసనాన్ని కోరింది. ఈ అభ్యర్థనను తిరస్కరిస్తూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీలతో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో సింగిల్ జడ్జి వద్ద ఉన్న పిటిషన్‌ను ప్రభుత్వం వెనక్కి తీసుకుంది. ప్రభుత్వం తరఫున ఏజీ బీఎస్ ప్రసాద్ వాదిస్తూ, ఇప్పటికే సుప్రీంకోర్టులో ప్రస్తావించామని, సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసే వరకు సింగిల్ జడ్జి యథాతథస్థితి మధ్యంతర ఉత్తర్వులు జారీ అంశంపై విచారణ చేసేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. దీనిపై ధర్మాసనం, ఒకసారి సింగిల్ జడ్జి తీర్పు చెప్పిన తర్వాత దానిపై అప్పీల్ కూడా దాఖలైనప్పుడు మళ్లీ ఆ అంశాన్ని సింగిల్ జడ్జి విచారణ చేసే ఆస్కారమే లేదని చెప్పింది. సాంకేతికంగా ద్విసభ్య ధర్మాసనం తీర్పు చెప్పిందనే కారణంగా సింగిల్ జడ్జి విచారణకు అనుమతించాలని ఏజీ కోరగా అందుకు అనుగుణంగా ఉత్తర్వులు ఇవ్వలేమని స్పష్టం చేసింది. సిట్ నుంచి కేసు ఫైళ్లు ఇవ్వాలని సీబీఐ ఒత్తిడి చేస్తోందని, సుప్రీంకోర్టులో అప్పీల్ దాఖలు చేసే నేపథ్యంలో సీబీఐ అత్యుత్సాహం సరికాదని ఏజీ చెప్పారు. తమ తీర్పుపై అభ్యంతరాలు ఉంటే సుప్రీంకోర్టుకు వెళ్లాలేగానీ ఇదే హైకోర్టులో అప్పీల్‌కు ఆస్కారమే లేదని ధర్మాసనం తేల్చి చెప్పింది.

జిల్లా వార్తలు

కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించిన మంత్రి



మహిళకు కళ్లజోడు తొడుగుతున్న పువ్వాడ

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా కేంద్రంలోని 18వ డివిజన్ శ్రీరాంనగర్‌లో ఏర్పాటుచేసిన కంటి వెలుగు శిబిరాన్ని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన ప్రజలు కంటి సంబంధిత సమస్యలతో బాధపడొద్దనే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. స్థానికులు శిబిరంలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం ప్రజలతో మాట్లాడి సౌకర్యాలపై ఆరా తీసిన మంత్రి, వైద్యులు సూచించిన వారికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. మేయర్ పునుకొల్లు నీరజ, కలెక్టర్ వీ.పీ.గౌతమ్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, కార్పొరేటర్ మందడపు లక్ష్మీమనోహర్ తదితరులు పాల్గొన్నారు.

వరి, మిర్చి పైర్లను పరిశీలించిన శాస్త్రవేత్తలు



తెగుళ్ల నివారణపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

తల్లాడ: మండలంలోని మిట్టపల్లి, నూతనకల్ గ్రామాల్లో వరి, మిర్చి పైర్లను వైరా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పంటలను ఆశిస్తున్న తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. వైరా కేవీకే కోఆర్డినేటర్ జె.హేమంత్‌కుమార్ మాట్లాడుతూ దుబ్బు దశలో ఉన్న వరిలో కాండం తొలిచే పురుగు, కాండం కుళ్లు తెగులు, అగ్గి తెగులు సోకినట్లుగా గుర్తించామని తెలిపారు. అలాగే, రెండో కోత దశలో ఉన్న మిర్చి పంటలో నల్ల తామర పురుగు, కాయకుళ్లు తెగులు ఆశించిందని, దీని నివారణకు వ్యవసాధికారుల సూచనల మేరకు మందులు వాడాలని సూచించారు. వైరా కేవీకే శాస్త్రవేత్తలు చైతన్య, ఫణిశ్రీ, ఏఓ ఎండీ తాజుద్దీన్, ఏఈఓలు త్రివేణి, హసీనాబేగం, నరేశ్, రైతులు పాల్గొన్నారు.

త్వరలోనే పోడు భూములకు పట్టాలు

- దరఖాస్తుల పరిశీలన త్వరగా పూర్తిచేయండి
- ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి యోగితారాణా



మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి యోగితారాణా, పక్కన కలెక్టర్లు గౌతమ్, అనుదీప్

ఖమ్మం సహకారనగర్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో దరఖాస్తు చేసుకున్న పోడు సాగుదారులకు పట్టాల పంపిణీపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సాంఘిక సంక్షేమ శాఖ కమిషనర్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పోడు భూముల ప్రత్యేక అధికారి డాక్టర్ యోగితా రాణా సూచించారు. ఖమ్మం కలెక్టరేట్‌లో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లు వీ.పీ.గౌతమ్, అనుదీప్‌తో పాటు రెవెన్యూ, అటవీ అధికారులతో బుధవారం ఆమె సమావేశమయ్యారు.

అర్హులెవరూ నష్టపోవద్దు

చాలాకాలంగా ఎదురుచూస్తున్న పోడు భూముల సమస్యకు త్వరలోనే పరిష్కారం లభించనుందని యోగితారాణా తెలిపారు. ఇప్పటికే దరఖాస్తులపై క్షేత్ర స్థాయిలో పరిశీలన, గ్రామసభల్లో విచారణ పూర్తయిందని చెప్పారు. ఆతర్వాత డివిజన్ స్థాయిలో ఆమోదం అనంతరం జిల్లా కమిటీకి పంపిస్తే పరిశీలన అనంతరం ఆమోదం తెలపాల్సి ఉంటుందని వివరించారు. ఖమ్మం జిల్లాలో షెడ్యూల్ తెగల నుండి 25,515 ఎకరాలపై హక్కు కోసం 9,507 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఇందులో 6,795 దరఖాస్తులు, 2,556 అదనపు ప్యాచ్‌లు కలిపి 13,656.95 ఎకరాలకు పట్టాల పంపిణీకి సిఫారసు చేస్తే, జిల్లా స్థాయి కమిటీలో ఇప్పటివరకు 4,359.38 ఎకరాలకు గాను 3,315 దరఖాస్తులు ఆమోదించారని వివరించారు. మిగతా అన్ని దరఖాస్తులను త్వరగా పరిశీలించాలని, అభ్యంతరాలపై దరఖాస్తుదారులతో మాట్లాడి అర్హులెవరూ నష్టపోకుండా చూడాలని యోగితారాణా సూచించారు. అనంతరం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు సంబంధించి దరఖాస్తులు, గ్రామసభలో సిఫారసుపై సమీక్షించారు. ఇంకా ఈసమావేశంలో భద్రాచలం ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు, ఖమ్మం అదనపు కలెక్టర్ స్నేహలత, డీఎఫ్ఓ సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, అధికారులు పాల్గొన్నారు.

ప్రజలు కోరిన సమాచారం ఇవ్వాల్సిందే..

రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ శంకర్‌నాయక్



మాట్లాడుతున్న కమిషనర్ శంకర్‌నాయక్

సూపర్‌బజార్(కొత్తగూడెం): సమాచారహక్కు చట్టం ద్వారా ప్రజలు కోరిన సమాచారాన్ని ముప్పై రోజుల్లో ఇవ్వాల్సిన బాధ్యత ఆయా శాఖల అధికారులపై ఉందని రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ డాక్టర్ గుగులోత్ శంకర్‌నాయక్ తెలిపారు. సమాచార హక్కు చట్టం కింద 25ఫిర్యాదులపై కొత్తగూడెం ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం ఆయన విచారించారు. అనంతరం అన్నిశాఖల అధికారులతో సమావేశమైన కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాలనలో పారదర్శకత, అధికార యంత్రాంగంలో జవాబుదారీతనం కోసం చట్టాన్ని ప్రవేశపెట్టినందున ప్రజలు కోరిన సమాచారం ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. సకాలంలో సమాచారం అందకపోతే ప్రజలు నేరుగా కమిషన్‌కు ఫిర్యాదు చేస్తున్నారని తెలిపారు. ఈ మేరకు ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వడంతో పాటు చట్టం ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే, బాధ్యులైన ఉద్యోగుల పేర్లు, ఫోన్ నంబర్లతో బోర్డులు ఏర్పాటుచేయాలని తెలిపారు. కాగా, ప్రజలు నేరుగా తనను 990881 7986 నంబర్ ద్వారా సంప్రదించవచ్చని కమిషనర్ శంకర్‌నాయక్ వెల్లడించారు.

నివేదన అర్చక సంఘం రాష్ట్ర కమిటీలో ఇద్దరికి స్థానం



అన్నవజ్జల ప్రసాద్‌శర్మ



ఆమంచి సురేష్‌శర్మ

ఖమ్మంగాంధీచౌక్: రాష్ట్ర దూప దీప నివేదన అర్చక సంఘంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా వాసులు పలువురికి స్థానం దక్కింది. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఖమ్మంకు చెందిన అన్నవజ్జల ప్రసాద్‌శర్మ, రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా ఆమంచి సురేష్ శర్మ నియమితులయ్యారు. యాదగిరిగుట్టలో జరిగిన సమావేశంలో రాష్ట్ర నలుమూలల నుంచి ప్రతినిధులు పాల్గొనగా, రాష్ట్ర నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈమేరకు రాష్ట్ర అధ్యక్షుడిగా దౌలతాబాద్ వాసుదేవ శర్మ మరోసారి ఎన్నిక కాగా, జిల్లా నుంచి ఇద్దరికి స్థానం దక్కగా పలువురు అభినందించారు.

రహదారిపై నమాజ్ చేసిన ముస్లింలు

మజీద్ నిర్మాణంలో జాప్యంపై నిరసన



రోడ్డుపై నమాజ్ చేస్తున్న ముస్లింలు

ఇల్లెందు: నిర్వాసిత కాలనీలో మజీద్ నిర్మాణానికి స్థలం కేటాయించినా పనులు చేపట్టకపోవడంతో ముస్లింలు రహదారిపై నమాజ్ చేసి నిరసన తెలిపారు. ఇల్లెందులో ఏర్పాటైన జేకే-5 ఓసీ నిర్వాసితులకు కొన్నేళ్ల కిందట ఆర్‌అండ్‌ఆర్ కాలనీ కట్టించారు. ఇక్కడ సింగరేణి సంస్థ ఆధ్వర్యాన మతాల వారీగా ఆలయాలకు స్థలాలు కేటాయించింది. ఈ క్రమంలో హిందువులకు ఆలయం, క్రిస్టియన్లకు చర్చి నిర్మించగా, మజీద్ స్థలంలో శంకుస్థాపన చేసినా పనులు సాగలేదు. అనంతర కాలంలో ఈస్థలంలో రెండేళ్ల కిందట హరితహారంలో భాగంగా మొక్కలు నాటించి మరోచోట స్థలం కేటాయిస్తామని ప్రజాప్రతినిధులు, అధికారులు చెప్పినా కార్యరూపం దాల్చలేదు. దీంతో మజీద్ కమిటీ బాధ్యులు ఎస్.కే.సలీమ్, వలీ ఆధ్వర్యాన బుధవారం రహదారిపై నమాజ్ చేసి నిరసన తెలిపారు. సింగరేణి, మున్సిపాలిటీ, రెవెన్యూ అధికారులు మాటలతో కాలం గడుపుతూ తాము రోడ్డుపై నమాజ్ చేసుకునే పరిస్థితి తీసుకొచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆశ్రమంలో నిద్రించిన ట్రైబల్ వెల్ఫేర్ డీడీ



కె.రేగుబల్లి పాఠశాల విద్యార్థినులతో మాట్లాడుతున్న డీడీ రమాదేవి

దుమ్ముగూడెం/చర్ల: దుమ్ముగూడెం మండలం లక్ష్మీనగరంలోని కె.రేగుబల్లి బాలికల ఆశ్రమ పాఠశాలలో ట్రైబల్ వేల్ఫేర్ డీడీ రమాదేవి మంగళవారం రాత్రి నిద్రించారు. మంగళవారం సాయంత్రం పాఠశాలకు చేరుకున్న ఆమె విద్యార్థినులతో మాట్లాడి సౌకర్యాలపై ఆరా తీశారు. అలాగే, పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించేలా సిద్ధం కావాల్సిన తీరుపై అవగాహన కల్పించారు. ఆ తర్వాత పాఠశాలలో విద్యార్థినులతో కలిసి నిద్రించిన డీడీ, బుధవారం ఉదయం మాగంగ్వాబాద్య ఆశ్రమ పాఠశాలను సందర్శించి బోధన, నాణ్యమైన భోజనం అందించడంపై ఉపాధ్యాయులకు సూచనలిచ్చారు. ఇక చర్ల మండలంలోని పెదమిడిసిలేరు గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలకు చేరుకున్న డీడీ, ఉదయం నుంచి సాయంత్రం వరకు పాఠశాలలోనే ఉండి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, విద్యాబోధనను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదో తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున ప్రణాళికాయుతంగా చదివి మెరుగైన ఫలితాలను సాధించాలని సూచించారు. కార్యక్రమాల్లో ఏటీడబ్ల్యూఓ పూనెం నర్సింహారావు, హెచ్‌ఎంలు ధనసరి నాగమణి, వీరాకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బొగ్గు, ఉత్పత్తి రవాణాకు అంతరాయం ఏర్పడొద్దు..

సింగరేణి డైరెక్టర్ బలరాం



జీకే ఓసీ వ్యూ పాయింట్ నుంచి పరిశీలిస్తున్న డైరెక్టర్ బలరాం, అధికారులు

సత్తుపల్లి/సింగరేణి(కొత్తగూడెం): బొగ్గు ఉత్పత్తి, రవాణాకు ఎలాంటి అంతరాయం లేకుండా పనులు చేపట్టాలని సింగరేణి డైరెక్టర్ (పా) ఎన్.బలరాం సూచించారు. ఎక్కడైనా అవసరమైతే పరికరాలను దిగుమతి చేసుకోవాలే తప్ప పనుల్లో ఆటంకం కలగకుండా చూడాలని తెలిపారు. కొత్తగూడెం ఏరియా పరిధిలోని సత్తుపల్లి జేవీఆర్ ఓసీ, జీకేఓసీలను జీఎంలు సీహెచ్.నర్సింహారావు, జక్కం రమేశ్, గురువయ్యతో కలిసి ఆయన బుధవారం పరిశీలించి, మాట్లాడారు. ఈ ఆర్థిక సంవత్సరం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడానికి రానున్న రెండు నెలలు చాలా కీలకమని తెలిపారు. లక్ష్యాన్ని చేరుకునేలా రోజువారీగా పనులు చేపట్టాలని, రోజుకు 10 నుంచి 11 రేకుల బొగ్గు రవాణా చేయాలని స్పష్టం చేశారు. రైల్వే అధికారులతో సంప్రదింపులు జరిపి వ్యాగన్లు సమకూర్చుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు ఎంవీ నర్సింహారావు, పి.నర్సింహారావు, మధుసూదన్, శామ్యూల్ సుధాకర్, రమేశ్, కరుణాకర్‌రావు, శ్రావణ్‌కుమార్, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిర్చి ధర మరింత తగ్గుముఖం

గరిష్ట ధర రూ.18,050గా నమోదు



రైతులు విక్రయానికి తీసుకొచ్చిన మిర్చి

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి ధర మరింత తగ్గింది. పంట విక్రయాలు పెరుగుతున్నాకొద్దీ ధర తగ్గుతుండటంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నెల 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు మిర్చి క్వింటాకు గరిష్టంగా జెండాపాటలో రూ.18,200 నమోదు కాగా, బుధవారం రూ.150 తగ్గి రూ.18,050గా పలికింది. ఖమ్మం మార్కెట్‌లో కొద్ది రోజులుగా మిర్చి విక్రయాలు పెరిగాయి. ఈ నెల మొదటి వరకు 20 నుంచి 30 వేల వరకు మిర్చి బస్తాలు రాగా, ప్రస్తుతం 50 వేలకు పైగా రైతులు తీసుకొస్తున్నారు. అయితే, జనవరి రెండోవారంలో రూ.21 వేలు పలికిన మిర్చి ధర మూడోవారానికి రూ.19,500కు పడిపోగా, ఈనెలారంభం నుంచి రూ.18,200గా నిలకడగా కొనసాగుతోంది. ఈ నేపథ్యాన బుధవారం 51,900 బస్తాల మిర్చి రాగా ధర మరింత తగ్గడంతో విక్రయానికి వస్తున్న రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మిర్చి క్వింటాకు గరిష్టంగా రూ.18,050, కనిష్టంగా రూ.12 వేలు, తాలు మిర్చికి గరిష్టంగా రూ.10 వేలు, కనిష్ట ధర రూ.7,500గా పలికింది. కాగా, మిర్చి కొనుగోళ్లను మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత, ఉన్నత శ్రేణి కార్యదర్శి రుద్రాక్షల మల్లేశం పర్యవేక్షించారు.